నమస్తే తెలంగాణ

# మహబూబాబాద్

5 | వరంగల్, శనివారం 21 జూన్ 2025 | MAHABUBABAD




భద్రకాళీ బోనం..

# ఇదేం రాజకీయం?

- అమ్మవారికి బోనం సమర్పించడంపై తలోమాట
- అధికార పార్టీలో భిన్నాభిప్రాయాలు
- సంప్రదాయం కాదన్న ఎమ్మెల్యే నాయిని.. సమర్పిస్తామన్న మంత్రి సురేఖ
- నిర్ణయం తాత్కాలికంగా వాయిదా

వరంగల్, జూన్ 20 : భద్రకాళీ అమ్మవారికి బోనంపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తలోమాట మాట్లాడుతున్నారు. అధికార పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వందల ఏళ్ల చరిత్ర కలిగిన భద్రకాళీ ఆలయంలో ఏనాడూ బోనం సమర్పించే సంప్రదాయం లేదని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అంటుండగా.. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆగమ శాస్త్రం ప్రకారమే బోనం సమర్పించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పడం ఇప్పుడు అధికార పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రజల విశ్వాసాలతో ముడిపడి ఉన్న అంశాన్ని వివాదాస్పదంగా మార్చడంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని, సురేఖల మధ్య ఇది విభేదాలకు తెరలేపింది. ఇద్దరి మధ్య సాగుతున్న మాటల పర్వం ఆలయంపై ఆధిపత్యం కోసం చేస్తున్న పోరుగా ఉన్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**బోనం సమర్పణపై పునరాలోచించాలి : నాయిని**

వరంగల్ ప్రజల ఇలవేల్పు దైవమైన భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పించే సంప్రదాయం లేదని, ఈ విషయంపై మంత్రి కొండా సురేఖ పునరాలోచన చేయాలి. ప్రజల నమ్మకం, విశ్వాసంతో ముడిపడి ఉన్న అంశాన్ని ఎవరితో చర్చించకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారు?. బోనం అంటేనే జంతుబలి ఉండే ఆచారం తెలంగాణవ్యాప్తంగా ఉంది. అమ్మవారికి బోనాలు సమర్పించే క్రమంలో జంతుబలిని ఆపడం సాధ్యమవుతుందా?. పండితులు, అర్చకులు, నగర ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలి.

**తాత్కాలికంగా వాయిదా : మంత్రి సురేఖ**

భద్రకాళీ అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నాం. రాజకీయ విభేదాలను అమ్మవారికి ముడిపెట్టి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానాలతో భద్రకాళీ బోనాల నిర్వహణను రద్దు చేశాం. భద్రకాళీ ఆలయం పరిధిలో శాకాహార బోనాలే ఉంటాయని ఈవో, వేద పండితులు, ప్రభుత్వం పలుమార్లు పునరుద్ఘాటించింది. ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళీ అమ్మవారికి బోనాలు నిర్వహించాలని నిర్ణయించాం. అయితే కొంతమంది మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తారనే ప్రచారంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. రాజకీయాల కోసం భక్తుల్లో తప్పుడు భావాలు నింపడం సహేతుకం కాదని భద్రకాళీ బోనాలు వాయిదా వేశాం. భద్రకాళీ అమ్మవారి బోనాల నిర్వహణపై సంప్రదింపులు జరిపిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం.

## కడియం శ్రీహరి నల్లికుట్లోడు

- నేను మంత్రిగా ఉంటే తట్టుకోలేకపోతున్నడు
- టీడీపీలో చేసినట్టు చేస్తే ఇక్కడ నడవదు
- మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు

వరంగల్, జూన్ 20 : స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఆమె మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషని, తాను మంత్రిగా ఉంటే తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. తన ముందు కూర్చోవడానికి నామోషీగా ఫీల్ అవుతున్నాడని, అందుకే తన మంత్రి పదవి పోతుందని తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడని ఆరోపించారు. తరచూ సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్దకు వెళ్లి తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడన్నారు. టీడీపీలో నడిపించినట్టు ఇక్కడ కూడా నడిపించాలని అనుకుంటున్నాడని అన్నారు. కానీ, ఇది కాంగ్రెస్ పార్టీ అని, ఇక్కడ అలాంటివి నడువదన్నారు. నాకు అదృష్టం ఉంది.. మంత్రిని అయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అవుతాడు. తరచూ నేను దిగిపోవాలని మాట్లాడడం సరికాదన్నారు. నా కూతురికి అదృష్టం లేదు.. ఎమ్మెల్యే కాలేదు. కడియం కూతురికి అదృష్టం ఉంది ఎంపీ అయిందని అని మంత్రి కొండా సురేఖ మీడియా చిట్‌చాట్‌లో హాట్ కామెంట్ చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు రేవూరి, కడియం, ఎమ్మెల్సీ సారయ్య


## కొండాపై ఎమ్మెల్యేల గరం గరం

- ఇష్టమున్నట్లు చేస్తామంటే కుదరదని స్పష్టం
- నాయిని ఇంట్లో ప్రత్యేక సమావేశం
- పీసీసీ చీఫ్‌కు ఫోన్‌లో ఫిర్యాదులు
- రెండు, మూడు రోజుల్లో కలిసి వివరించాలని నిర్ణయం
- బీసీ కార్డుతో ఏం మాట్లాడితే అది ఊరుకోం
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజం

నయీంనగర్, జూన్ 20 : మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళిపై ఎమ్మెల్యేలు గరం అయ్యారు. గురువారం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ.. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎవరైనా సరే పార్టీకి కట్టుబడి ఉండాలి. పార్టీ గీత దాటి, ఏం చేసినా నడుస్తుంది అన్నట్టు వ్యవహరిస్తే సహించేది లేదు, హద్దులు దాటి ప్రవర్తిస్తే ఊరుకోం, రానున్న రోజుల్లో ఎలక్షన్లు ఉన్నాయి ఇలా చేస్తే పార్టీకి నష్టం జరుగుతుంది. లోకల్ బాడీ ఎలక్షన్ సమయంలో ఇలా మాట్లాడటం సరైంది కాదు, ఏమైనా సమస్యలుంటే కూర్చొని మాట్లాడుకోవాలని గతంలోనే మీటింగ్‌లో అనుకున్న సంగతి మర్చిపోయి, సీనియర్లు ఎక్కడ పడితే అక్కడ నోటికి వచ్చినట్లు మాట్లాడడం సరికాదు. నచ్చింది చేస్తాం, నచ్చింది మాట్లాడుతాం అంటే ఇక్కడ నడవదని, కులం కార్డు అడ్డం పెట్టుకుంటాం అంటే ఇక్కడ నడువదు, ఇక్కడ కార్డులు పని చేయవ్ ఇక్కడ అన్ని కులాల వారు ఉన్నారు, అన్ని జాతుల వారు ఉన్నారు, చేసిన పాపాలకు కులం అడ్డు పెట్టుకుంటే పోతాయా.. ఆ పద్ధతి మార్చుకోవాలి. కష్టం, సుఖం దేనికైనా పార్టీ ఉంది అధిష్టానానికి చెప్పుకోవాలి అంతేకానీ ప్రతి దానికి రోడ్లపై ఏది పడితే అది మాట్లాడితే మంచిది కాదు. త్వరలోనే అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం. నియోజకవర్గాల్లో కష్టపడి తిరుగుతుంటే ఇలా చేయడం సరైంది కాదు, ఎక్కువ సేపు ఇలా ఉంటే మోయలేం. తక్కువ టైంలోనే సమస్యకు పరిష్కారం చూపెడుతా'మని స్పష్టంచేశారు.

'తెలంగాణ వరప్రదాయిని.. ఇంజినీరింగ్ అద్భుతం.. రైతల పాలిట కల్పతరువు.. అది ప్రాజెక్టు మాత్రమే కాదు.. నాగరికతకు చిహ్నం..' ఇలా కాళేశ్వరం గురించి ఎంత చెప్పినా అది తక్కువే అవుతుంది. అపర భగీరథుడు కేసీఆర్ దూరదృష్టితో ఉమ్మడి వరంగల్‌లోని మేడిగడ్డ వద్ద పురుడు పోసుకొని వందల టీఎంసీలను ఎత్తిపోసి లక్షలాది ఎకరాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేసిన తెలంగాణ జీవనాడి కాళేశ్వరం. సాగు, తాగునీటి అవసరాలు తీరి కరువు రూపుమాపడమే గాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖల్ని సమూలంగా మార్చేసింది. స్వరాష్ట్ర ఆకాంక్షలో ఒకటైన 'మన నీళ్లు మనకే' నినాదం కేసీఆర్ సంకల్పంతో సాకారమై నేటికి ఆరేళ్లు పూర్తి కాగా, కాంగ్రెస్ సర్కారు వచ్చాక కాళేశ్వరంపై పనిగట్టుకొని కుట్రలకు తెరతీయడంతో రైతన్నకు మళ్లీ కష్టకాలం వచ్చింది.

- వరంగల్, జూన్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)






# జీవధార కాళేశ్వరం

### బీడు భూములను సస్యశ్యామలం చేసిన ప్రాజెక్టు

- కేసీఆర్ ముందుచూపుతో 'మన నీళ్లు మనకే' నినాదం సాకారం
- ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన ఇంజినీరింగ్ అద్భుతం
- ప్రతి ఎకరాకు సాగునీరు
- ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణ
- నేటితో ప్రాజెక్టుకు ఆరేళ్లు
- కాంగ్రెస్ సర్కారు కుట్రలతో రైతులకు మళ్లీ కష్టకాలం



మేడిగడ్డ బరాజ్ నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ సాగుకు జీవనాధారం. మన నీళ్లు మనకే అనే నినాదాన్ని ఆచరణలోకి తెచ్చిన అద్భుతం. తెలంగాణలోని అత్యధిక సాగు భూములకు నీటిని అందించే లక్ష్యంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ఆరేండ్లు పూర్తయ్యాయి. 2019 జూన్ 21న తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళికతో తెలంగాణలోని సాగు భూములు సస్యశ్యామలమయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చింది. కాళేశ్వరం ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసి ప్రపంచానికి తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరాకు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందించడంలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలకంగా మారింది. ఎస్సారెస్పీ ప్రాజెక్టు కింద లోయర్ మానేరు డ్యాం నుంచి వర్ధన్నపేట మండలం ఇల్లంద వరకు మొదటి దశలో 5,05,725 ఎకరాల ఆయకట్టు ఉన్నది. రెండో దశ పరిధిలో ఇల్లంద తర్వాత నుంచి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వరకు 3,65,000 ఎకరాల ఆయకట్టు ఉన్నది. రెండు దశల్లోని మొత్తం 8.70 లక్షల ఆయకట్టుకు రెండు పంటలకు ఏడాదిన్నర క్రితం వరకు కాళేశ్వరం నీళ్లు చేరాయి. ఎస్సారెస్పీ రెండు దశల్లోని పంటల సాగు అవసరాలతో పాటు చెరువులు, రిజర్వాయర్లకు నీటి సరఫరా జరిగింది. వరంగల్ పాత జిల్లాలోని ఎస్సారెస్పీ రెండు దశల్లో కలిపి 4,72,287 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఈ ఆయకట్టుకు రెండు పంటలకు పూర్తిస్థాయిలో కాళేశ్వరం నీళ్లు అందాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు మొదలుపెట్టింది. పంటలకు నీళ్లు రాకుండా చేస్తూ అన్నదాతలను ఆగం చేస్తున్నది.

| జిల్లా | ఎస్సారెస్పీ ఆయకట్టు (ఎకరాల్లో) |
|---|---|
| వరంగల్ | 1,08,407 |
| మహబూబాబాద్ | 84,922 |
| జనగామ | 83,635 |
| హనుమకొండ | 64,937 |
| ములుగు | 49,705 |
| జయశంకర్ భూపాలపల్లి | 35,680 |

### బీఆర్ఎస్‌తోనే సాకారం..

తెలంగాణలోని దాదాపు 70 శాతం ప్రాంతానికి తాగునీరు, సాగునీరు, పరిశ్రమల నీటి అవసరాలను తీర్చే లక్ష్యంతో తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. ఏటా కనీసం 80 లక్షల ఎకరాలకు నీరందించేలా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి ప్రాంతాల్లోని 20 లక్షల ఎకరాలకు నీరందుతున్నది. కాళేశ్వరం నీటితోనే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు నీరు అందుతున్నది. నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు కాళేశ్వరం నీరే ఆధారమవుతున్నది. కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, నిర్మల్, మేడ్చల్, పెద్దపల్లి, హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, జనగామ, సూర్యాపేట జిల్లాల్లో మరో 20 లక్షల ఎకరాల ఆయకట్టు కాళేశ్వరం ప్రాజెక్టుతో స్థిరీకరణ అయ్యింది. 2016 మార్చి 8న దశాబ్దాల తరబడి కొనసాగిన వివాదాలకు స్వస్తి పలుకుతూ, మహారాష్ట్ర ప్రభుత్వంతో తెలంగాణ ప్రభుత్వం నీళ్లపై ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం మొదలైంది. 2016 మే 2న కన్నెపల్లి వద్ద కాళేశ్వరం ప్రాజెక్టుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రధాన భాగమైన బ్యారేజీలు, పంపుహౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణాన్ని మూడేండ్లలోనే పూర్తి చేశారు. దేశంలోనే శరవేగంగా నిర్మాణం పూర్తయిన భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం ప్రాజెక్టు ఘనత సాధించింది. మేడిగడ్డ వద్ద సముద్ర మట్టానికి 100 మీటర్ల ఎత్తులో గోదావరి నీళ్లను ఆరు దశల్లో లిఫ్టు చేసి 618 మీటర్ల ఎత్తులో ఉండే కొండపోచమ్మ సాగర్ వరకు నీరు తరలింది. గోదావరి నది నీళ్లను అర కిలోమీటరుకు పైగా ఎత్తుకు లిఫ్టు చేయడంతో తెలంగాణలోని కరువు నేల సస్యశ్యామలం అయ్యింది. కాళేశ్వరం నీటితోనే ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులను నింపడంతో తెలంగాణలో 199 కిలోమీటర్ల మేర గోదావరి సజీవ నదిగా మారింది.

## ఓపీలో వైద్యులు లేకపోవడంపై కలెక్టర్ సీరియస్

- విధులకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- నమూనాలు సేకరించిన రోజే రిపోర్టులు అందించాలి
- ఎంజీఎం దవాఖాన సందర్శనలో వరంగల్ కలెక్టర్ సత్యశారద



పారా మెడికల్ రిపోర్టుల ఆలస్యంపై టెక్నీషియన్లను వివరణ అడుగుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ చౌరస్తా, జూన్ 20 : ఎంజీఎం దవాఖాన 13వ నంబర్ గదిలో నిర్వహిస్తున్న ఆర్థో పెడిక్ ఓపీ (మహిళలు) విభాగంలో వైద్యులు అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. 13 మంది పేషెంట్లు డాక్టర్ల కోసం ఎదురుచూడడంపై మండిపడ్డారు. అందుబాటులో లేని, విధులకు హాజరుకాని వైద్యులపై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఎంజీఎంహెచ్‌లో విభాగాల వారీగా తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో యంత్రాల పని తీరును అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐసీయూలోని కార్డియాలజీ విభాగంలో మరమ్మతులకు గురైన పరికరాలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అక్కడే ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెలో ఉన్న కాగితాలను నర్సింగ్ ఆఫీసర్, రెసిడెంట్ డాక్టర్‌తో చదివించారు. వైద్యం కోసం వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఎంజీఎం వార్డు గోడలకు ఆనుకొని హోటల్స్ నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన మదర్ ఫీడింగ్ రూం, అటెండెంట్ విడిది గదులను పరిశీలించారు. రికార్డులను నమోదు చేయకపోవడంపై ఆగ్రహించారు. 47వ నంబర్ ఓపీ ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్షలను వెంటవెంటనే పూర్తి చేయాలని, నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించడానికి ఒక రోజు సమయాన్ని తీసుకోవడంపై కలెక్టర్ మండిపడ్డారు. ఎంసీహెచ్ విభాగం పక్కన రోడ్డు మధ్యలో ఉన్న బావిని పూడ్చాలన్నారు. వయో వృద్ధుల వార్డును ఏర్పాటు చేయడానికి తగిన సౌకర్యాలు ఉన్న గదినిఎంపిక చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంజీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, విభాగాధిపతులు, ఆర్ఎంవోలు తదితరులు పాల్గొన్నారు.

## హనుమకొండ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

**పోలీసుల తనిఖీల్లో ఆరు డిటోనేటర్లు స్వాధీనం**

సుబేదారి, జూన్ 20: హనుమకొండ అదాలత్‌లోని జిల్లా కోర్టులో బాంబు పెట్టినట్లు శుక్రవారం ఓ అగంతకుడు పోలీసులకు ఫోన్ చేశాడు. దీంతో వరంగల్ కమిషనరేట్ బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది హుటాహుటిన అక్కడి చేరుకొని తనిఖీలు చేయగా, కోర్టు ఆవరణలోని పాత భవనం పక్కన ఆరు డిటోనేటర్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ డిటోనేటర్లు ఎక్కడి నుంచి వచ్చాయని సుబేదారి పోలీసులు, బాంబు స్క్వాడ్ సిబ్బంది ఆరా తీయగా, కోర్టు కేసు ప్రాపర్టీ కింద వాటిని అక్కడ ఉంచినట్లు తెలిసింది. డిటోనేటర్లను నిర్లక్ష్యంగా వేయడం, వాటి నుంచి ఎవరైనా వెళ్తే పెను ప్రమాదం జరిగేదని పోలీసులు చెబుతున్నారు. గతంలో రెండు సార్లు ఇలానే అగంతకులు ఫోన్‌లు చేశారని, ఇది మూడో సారి ఫోన్ వచ్చిందని, తనిఖీల్లో డిటోనేటర్లు లభ్యమవడం కలకలం రేపింది. వీటిపై పోలీసులు పూర్తి విచారణ చేపట్టారు.

### నేడు ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి



హనుమకొండ, జూన్ 20 : తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమస్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 14వ వర్ధంతిని జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యాన వనం(ఏకశిల పార్కు)లో వర్ధంతి నిర్వహించనున్నారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఉద్యమ శిఖరం, ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తన గొంతుకను వినిపించిన జయశంకర్ సార్‌కు నివాళులర్పించేందుకు అంతా సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులతో పాటు ట్రస్టు సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నారు.

### బాలికపై లైంగిక దాడి.. ఇద్దరిపై పోక్సో కేసు

గూడూరు, జూన్ 20 : బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. బాలిక గుండెంగ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటికి రాగా, దూర బంధువైన జల్లి గ్రామానికి చెందిన కుర్ర యాకూబ్, అతడి స్నేహితుడితో కలిసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాలిక ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఏటూరునాగారం ఐటీడీఏలో అధికారులను కలిసేందుకు వచ్చిన బీఏఎస్ విద్యార్థులు, తల్లిదండ్రులు

## బెస్ట్ స్కూళ్లకు నిధుల గండం

- రెండేళ్లుగా విడుదల చేయని రాష్ట్ర ప్రభుత్వం
- ఆర్థికభారంతో కొట్టుమిట్టాడుతున్న ప్రైవేట్ పాఠశాలలు
- తరగతి గదిలో పేద విద్యార్థులపై 'వివక్ష'
- పుస్తకాలు ఇవ్వకపోవడంతో బడికి పోలేమంటూ ఆవేదన

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్(బీఏఎస్) లక్ష్యం నిధుల లేమితో నీరుగారుతోంది. రెండేళ్లుగా సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆర్థికభారంతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇక పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులు వివక్ష ఎదుర్కొంటున్నారు. తోటి పిల్లలు పుస్తకాలు, కాపీలు, యూనిఫాం, షూస్ వేసుకుని దర్జాగా వస్తుంటే, బీఏఎస్ కింద చదువుకుంటున్న విద్యార్థులకు మాత్రం అవేవీ లేక బడికి వెళ్లాలంటే కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇప్పటికైనా సర్కారు 'బెస్ట్' స్కూళ్లకు నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

- ఏటూరునాగారం/జనగామ చౌరస్తా/నర్సంపేట, జూన్ 20

14లో

## జోహార్.. జోహార్

**అశ్రునయనాలతో గణేశ్‌కు వీడ్కోలు**





అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజలు, గ్రామస్తులు, (ఇన్‌సెట్)లో గణేశ్ (ఫైల్)

- ఎరుపెక్కిన వెలిశాల
- భారీగా తరలివచ్చిన జనం
- హాజరైన ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నేతలు
- అమరవీరుడికి ఘన నివాళి
- రాష్ట్ర సరిహద్దుల నుంచి తరలివచ్చిన అభిమానులు

14లో